సమావేశము – IV
వాల్యూము – I
సెం. 1

వెల : రూ. 3-00
11 మార్చి, 2016
శుక్రవారము,
(శక సం. 1937,
ఫాల్గుణం – 21)

# తెలంగాణ శాసన సభ కార్యకలాపాలు

## అధికార నివేదిక

<u>విషయ సూచిక</u>

1. సంతాప ప్రతిపాదన : ... 1
తెలంగాణ శాసనసభ సభ్యుడు శ్రీ రాంరెడ్డి వెంకట రెడ్డిగారి మృతి గురించి.

# తెలంగాణ శాసనసభ

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| సభాపతి | : | శ్రీ ఎస్. మధుసూధనాచారి |
| ఉప సభాపతి | : | శ్రీమతి పద్మా దేవేందర్ రెడ్డి |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| సంయుక్త కార్యదర్శులు | : | డా.వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్ |
| | | శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్ |
| | | శ్రీ సిహెచ్. ఉపేందర్ రెడ్డి |
| | | శ్రీమతి వి. ఎస్. ప్రసన్న కుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీ పి. శ్రీనివాస్ |

# తెలంగాణ శాసన సభ చర్చలు

## అధికార నివేదిక

## (నాల్గవ సమావేశము – మొదటి రోజు)

## శుక్రవారం, మార్చి 11, 2016

(సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ సభాపతి అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

### సంతాప ప్రతిపాదన :
### తెలంగాణ శాసనసభ సభ్యుడు
### శ్రీ రాంరెడ్డి వెంకట రెడ్డి గారి మృతి గురించి

మిస్టర్ స్పీకర్: శ్రీ రాంరెడ్డి వెంకటరెడ్డి గారి సంతాప తీర్మానం.

శ్రీ కె. చంద్రశేఖర రావు (ముఖ్యమంత్రి): అధ్యక్షా, సీనియర్ శాసనసభ్యులు పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్ శ్రీ రాంరెడ్డి వెంకటరెడ్డి గారి ఆకస్మిక మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాను. శ్రీ రాంరెడ్డి వెంకటరెడ్డి గారు 1944వ సంవత్సరం ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం లింగాల గ్రామంలో జన్మించారు. వారి ప్రజా జీవితంలో అనేక పదవులను అధిష్టించారు. సర్పంచ్‌గా, సహకార సంఘం అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారు. ఐదుసార్లు శాసన సభ సభ్యునిగా ఎన్నికైనారు. ఒక టర్మ్ మొత్తం మంత్రిగా కూడా బాధ్యతలు నిర్వర్తించారు. రాంరెడ్డి వెంకటరెడ్డి గారు మిత భాషి, మృధు స్వభావి వ్యవసాయాన్ని అమితంగా కాంక్షించిన పెద్దలు. వ్యవసాయం పట్ల, పశు పోషణ పట్ల వారికున్న మక్కువ ఎక్కువ. అప్పటి ఆంధ్ర ప్రదేశ్‌లో లేదా భారత దేశంలో ఎక్కడైనా పశువులకు సంబంధించిన మేలు రకం పశువుల పోటీలు జరిగితే ప్రతిసారి వెంకటరెడ్డి గారు ప్రత్యేకంగా, అభిమానంగా పెంచేటటువంటి గిత్తలకి అవార్డులు దక్కేవి. వెంకటరెడ్డి గారికి అనుకోకుండా దురదృష్టవశాత్తు కాన్సర్ వ్యాధి సోకడం, వారు కొంత కాలంగా చికిత్స పొందుతున్నప్పుడు, వారి వైద్య ఖర్చుల కోసం ప్రభుత్వానికి అప్లికేషన్‌ను పంపితే ప్రభుత్వం తరపు నుంచి రూపాయలు 84 లక్షలు మంజూరు చేయడం జరిగింది. కానీ బలీయమైన విధి వారిని మన మధ్య లేకుండా చేసింది. ప్రభుత్వ పక్షాన, వ్యక్తి గతంగా నా పక్షాన వెంకట రెడ్డి గారి మృతికి తీవ్రమైన సంతాపాన్ని తెలియచేస్తున్నాను. శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు దుఃఖాన్ని తట్టుకునే ఆత్మస్థైర్యాన్ని భగవంతుడు కల్పించాలని, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను.

శ్రీ కె. జానారెడ్డి (నాగార్జున సాగర్): అధ్యక్షా, పెద్దలు స్వర్గీయ రాంరెడ్డి వెంకటరెడ్డి గారి మరణం మనందరికీ మనస్తాపం. ప్రత్యేకంగా మాకు తీరని లోటు. వారి మరణానికి నా నివాళులు అర్పిస్తున్నాను. గౌరవ ముఖ్య మంత్రి గారు ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సమర్ధిస్తున్నాను. ఈ రాష్ట్ర ప్రజలందరికీ గత ముప్పై సంవత్సరాలు ప్రత్యక్షంగా తెలిసిన వ్యక్తి. ముఖ్యంగా ముప్పైమూడు సంవత్సరాల క్రితం మొదటిసారిగా ఆయనకు నాకు పరిచయం ఏర్పడింది. గతంలో నేను వేరే పార్టీలో ఉన్నప్పటికీ అత్యంత అభిమానించిన వ్యక్తి. అంతేకాకుండా నాటి మొదలు నేటి వరకు ఆ అనుబంధం, ఆ ఆత్మీయత తరగని విధంగా కొనసాగించిన వ్యక్తనే విషయాన్ని గుర్తు చేస్తున్నాను. ఈ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ నిర్మాణానికే కాక, ఆయన విద్యార్థి దశ నుండి కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో పాల్గొని అటు విద్యార్థి నాయకుడుగా, ఆ తరువాత 1969వ సంవత్సరంలో తెలంగాణ వచ్చినప్పుడు ప్రత్యక్షంగా వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న వ్యక్తి. ఆ తరువాత వారి గ్రామానికి రెండు నుంచి మూడు పర్యాయాలు సర్పంచ్‌గా, ఆ తరువాత ఖమ్మం జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడిగా, వివిధ హోదాల్లో పనిచేయడంతోపాటు పార్టీ నిర్మాణం ప్రతిష్ట పెంచడానికి విశేషకృషి చేశారు. దాని యొక్క పర్యవసానం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యాన ఆయన ఐదు పర్యాయాలు శాసన సభ్యునిగా ఎన్నికవడంతోపాటు మంత్రిగా పనిచేసి

ప్రజాభిమానం పొందాడు. ఇప్పుడే ముఖ్య మంత్రి గారు తెలిపిన విధంగా ఆయనకు గ్రామీణ ప్రాంతం అన్నా, వ్యవసాయం అన్నా మిక్కిలి అభిమానం. స్వయంగా కృషీవలుడు. ఆ తరువాత అనేక పరిశోధనలతో ఇతర ప్రాంతాలను ప్రభావితం చేశారు. పశుపోషణతోపాటు పశువులను మేపడంలో కానీ, పెంచడంలో కానీ, పందేల కోసం ఎద్దులను పెంచే విషయం రాష్ట్రానికి అంతటికీ తెలుసు. తెలంగాణ రాష్ట్రంలో, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా అనేక చోట్ల పోటీలో ఆయన ఎద్దులే పాల్గొని గెలుపొంది, అనేక అవార్డులను, పారితోషకాలు పొందాయి. ఈ మధ్యనే ఆఖరిగా వారి ఎద్దుల పందేలను నేను ప్రారంభించి, తిలకించడంతోపాటు బహుమతిని ప్రధానం చేశాను. వారం పదిహేను రోజుల తరువాత వారు చనిపోవడం జరిగింది. వాస్తవమేమంటే మరణం సహజమైనది. కొన్ని సంవత్సరాలుగా చికిత్స పొందుతూ ఆయనకి వ్యాధి గురించి తెలిసి కూడా ధైర్యంగా ఇటు పార్టీలో కానీ, అటు కుటుంబంలో కానీ, ఏ మాత్రం ఇతరులకి ఇబ్బంది కలగకుండా ఆయన ధైర్యంతో బ్రతుకును సాగించిన సంగతి మాలో కొందరికి తెలుసు. మూడు నాలుగు సంవత్సరాలుగా ఉన్న అనారోగ్యం వల్ల అకాల మరణం చెందారు. నేను ఒకటి రెండు పర్యాయాలు ఆయన కార్యక్రమాల్లో పాల్గొన్నప్పటికీ, శాసనసభా పక్షంగా నేను ఆ కుటుంబానికి నా ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియచేయడంతోపాటు ఆయన ఆత్మకి శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. అదే విధంగా వ్యవసాయంపై, పశుపోషణపై ఆయనకి ఉన్న అంకిత భావం, నిబద్ధత వంటి అంశాలను ఏ పార్టీలో ఉన్న వారైనా ఆ స్ఫూర్తి పొందాలని ఈ సందర్భంగా కోరుతూ నేను సెలవు తీసుకుంటున్నాను. ఒక రిక్వెస్ట్ ఏమిటంటే, మా పార్టీ తరుపు నుంచి అజయ్‌కుమార్ అనే వ్యక్తికి ఈ మధ్య కాలంలో అత్యంత సన్నిహితంగా ఉంటూ ఒక సంవత్సర కాలం నుండి రోజు వారి కార్యక్రమాల్లో ఆయన విషయాలను గమనిస్తున్నందున వారికి, మాట్లాడడానికి ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

**10.10 ఉ.** శ్రీ తుమ్మల నాగేశ్వర రావు (రోడ్లు, భవనాల శాఖ మంత్రి): అధ్యక్షా, మన మధ్యలో ఉండవలసినటువంటి గౌరవ శాసనసభ్యులు, సీనియర్ రాజకీయవేత్త శ్రీ రాంరెడ్డి వెంకటరెడ్డిగారు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. ఖమ్మం జిల్లా రాజకీయాల్లో 1969వ సంవత్సరం నుంచి ఒక యోధుడుగా, కమ్యూనిస్టు క్వాటర్‌లో కూడా పార్టీని బ్రతికించారు. ముందుగా మూడు సార్లు ఓటమి పాలైనా, ధైర్యంతో రజబలి గారి మరణానంతరం బై ఎలక్షన్‌లో గెలిచినప్పటి నుంచి ఇప్పటివరకు ఓటమి లేకుండా వచ్చినటువంటి నాయకుడు శ్రీ రాంరెడ్డి వెంకటరెడ్డి. జిల్లా రాజకీయాలలో కూడా ఆటుపోటులకు ఎదురుగా ఉండేటువంటి నాయకుడు ఆయన. శాసనసభలో లేదా వేరే కార్యక్రమాలకు వారు హాజరైనప్పుడు నిలువెత్తు విగ్రహం, నిండైన పంచకట్టు, అసలైనటువంటి రైతు రూపంతో వెంకటరెడ్డి గారు కనిపించేవారు. ఆయనకు వ్యాధి సోకిన తర్వాత నేను ఆయనను చూడటానికి వెళ్లినప్పుడు ఆయన మంత్రిగా పని చేసినప్పటికీ వారి వైద్యం కోసం కావలసిన వైద్య ఖర్చులు అందించమని ముఖ్యమంత్రిగారిని అడగమని కోరారు. ముఖ్యమంత్రిగారికి ఈ విషయం తెలియగానే వారు ఎంత అడిగితే అంత ఇచ్చేయండి, వారు పెద్దమనిషి, సిట్టింగ్ ఎమ్.ఎల్.ఏ, వారికి మనము ఎంతైన ఖర్చు పెడదామని, ఆయనకు కావలసినటువంటి మొత్తం ఖర్చును ఒకేసారి గౌరవ ముఖ్యమంత్రి గారు మంజూరు చేశారు. ఆయన కోలుకుంటారనే మేమందరం ఆశతో ఎదురుచూశాము. ఖమ్మం జిల్లా రాజకీయాలలో వెంకటరెడ్డి గారిది ఒక విలక్షణమైన రాజకీయం. రైతుగానే కాకుండా, మంత్రిగా ఉన్నా కూడా ప్రతిరోజు ఇంటికి వెళ్లే అలవాటు ఉన్నటువంటి వ్యక్తి. ఆయన రోజు పొలానికి వెళ్లకుండా, గిత్తలను, పశువులను చూడకుండా ఉండలేనటువంటి మనిషి. గత 40 సంవత్సరాలుగా అన్ని కార్యక్రమాలకు హాజరయ్యే రాజకీయనాయకుడు. ముఖ్యంగా గిరిజన కుటుంబాలతో మమేకమైన వ్యక్తి. ఒకసారి కాంగ్రెస్ పార్టీ ఆయనకు టికెట్ నిరాకరించినప్పటికి కూడా స్వతంత్ర అభ్యర్థిగా నిలబడి రాజకీయాల్లో విజయం సాధించి ఆయన్ను నాయకుడిగా పొందిన ఘనత ఖమ్మం జిల్లా గిరిజనులకు దక్కింది. అంటే గిరిజనుల జీవితాల్లో అంత మమేకమైనటువంటి వ్యక్తిగా వెంకటరెడ్డిగారికి గుర్తింపు ఉంది. గడి, దొర అన్నటువంటి భేదభావం లేకుండా ఆ గడిని వాళ్లు దేవాలయంగా మార్చుకొని ప్రతి చిన్న విషయాన్ని గిరిజనులు ఆయనకు చెప్పుకొని పరిష్కరించుకునే పద్ధతి వెంకటరెడ్డి గారి యొక్క పాతలింగాల గ్రామంలో నేను చూశాను. అటువంటి వ్యక్తి రాజకీయాలలో సుదీర్ఘకాలం అంటే దాదాపు 8సార్లు పోటీ చేశారు. 5,6సార్లు గెలవటం కూడా జరిగింది. నాతో ప్రత్యేక అనుబంధం కలిగినటువంటి వ్యక్తి ఈ రోజు మనలో లేకపోవడం చాలా బాధాకరం. గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాపతీర్మానాన్ని సమర్థిస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని వారి కుటుంబ సభ్యులకు తీవ్ర సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి.ఎస్.రెడ్యా నాయక్ (డోర్నకల్): అధ్యక్షా, స్వర్గీయ శ్రీ రాంరెడ్డి వెంకటరెడ్డి గారి మృతి పట్ల గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానానికి మద్దతు తెలుపుతున్నాను.

వెంకటరెడ్డిగారికి, నాకు చాలా అవినాభావ సంబంధం ఉండేది. ఎందుకంటే నేను వరంగల్ జిల్లాకు సంబంధించినటువంటి శాసనసభ్యున్ని, ఆయన నియోజక వర్గం, నా నియోజకవర్గం రెండూ ప్రక్కప్రక్కనే ఉంటాయి. ఆయన మొదటిసారి బై ఎలక్షన్‌లో నిలబడినప్పుడు సుజాత నగర్ నియోజక వర్గం 250 తండాల వరకు ఉండేవి. అప్పుడు ఆయన ప్రత్యేకంగా వచ్చి ఈ ఎన్నికల్లో నువ్వు తండా, తండాకు తిరగాలి అని కోరినప్పుడు నేను ఎన్నికలు ప్రారంభం నుంచి పూర్తయ్యే వరకు అన్ని తండాలు తిరిగినప్పుడు, ప్రజలు మంచి మెజారిటీతో గెలిపించడం జరిగింది. దానితో నాకు, రాంరెడ్డి వెంకటరెడ్డిగారికి మంచి అనుబంధం ఏర్పడింది. నేనంటే చాలా అభిమానించే వ్యక్తి, ఎప్పుడు కలిసినా ఆప్యాయతతో మాట్లాడే వ్యక్తి అయన. అటువంటి వ్యక్తి ఈ రోజు మా నియోజక వర్గంలో లేకపోవడం చాలా బాధాకరం. విచారకరం. వారు ముఖ్యమంత్రిగారిని రూ.80లక్షలు అడిగితే మొత్తం ఒకేసారి మంజూరు చేశారు. వారి కుటుంబానికి నా యొక్క సానుభూతిని తెలియజేస్తూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని దేవుణ్ణి ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జలగం వెంకటరావు (కొత్తగూడెం): అధ్యక్షా, రాంరెడ్డి వెంకటరెడ్డి గారు మరణించడం చాలా బాధాకరం. వారు ఖమ్మం జిల్లాలో ముఖ్యంగా గిరిజనుల అభివృద్ధికి చాలా కృషి చేశారు. ఈ మధ్యకాలంలో రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు భద్రాచలంలో నిర్వహిస్తున్నప్పుడు పాల్గొనడానికి నేను వెళ్లినప్పుడు సారపాక ఐటిసి గెస్ట్‌హౌస్‌లో వారు ఉన్నారు. అప్పుడు నేను కూడా అనుకోకుండా అక్కడకు వెళ్లడం జరిగింది. వారు దాదాపు గంటసేపు నాతో కుటుంబ బాగోగులు గురించి మాట్లాడారు. వారు శాసనసభ్యులుగా ఉన్న నియోజక వర్గం సుజాత నగర్‌లో ఒక భాగం నా ప్రస్తుత నియోజక వర్గంలో ఉన్నది. వారి ఆరోగ్యం గురించి నేను అడిగినప్పుడు, ప్రస్తుతం బాగుందని ఆయన చెప్పారు. అంతలోనే ఆయన మరణించడం చాలా బాధాకరం. చాలా సందర్భాలలో ఆయనతో కలిసి నేను పని చేశాను. 2004లో నేను ఎన్నికైనప్పుడు వారు కూడా నాతో శాసనసభలో ఉన్నారు. జిల్లాలలో కొన్ని జాయింట్ కార్యక్రమాలు కూడా ఇద్దరము కలసి చేశాము. ఈ రోజు వారి గురించి మాట్లాడవలసి వస్తుందని నేను ఎప్పుడూ అనుకోలేదు. ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమర్థిస్తూ, రాంరెడ్డి వెంకటరెడ్డి గారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

جناب سید احمد پاشاہ قادری(Janab Syed Ahmed Pasha Quadri): جناب اسپیکر صاحب! ہاؤز کے ایک سینئر رکن جناب رام ریڈی وینکٹ ریڈی صاحب کے اچانک انتقال پر ہاؤز کو افسوس ہے۔ وہ ایک سینئر رکن تھے' نہایت ہی ملنسار اور ہنسمکھ طبیعت کے تھے۔ ایک طویل عرصہ میں انہوں نے ہاؤز میں اور اپنے حلقہ میں جو خدمات انجام دئے' ان سے تو ہر کوئی واقف ہے۔ کھمم ضلع کے کچھ مسائل کے تعلق سے مجھے ان سے دوبار بات کرنے کا موقع ملا تو میں نے محسوس کیا کہ اقلیتوں کے لئے اور غریبوں کے لئے ان کے پاس اچھا جذبہ تھا اور وہ ہمیشہ تعاون کرتے رہے اور اپنے تجربہ سے لوگوں کو بھی فائدہ پہنچاتے رہے۔ ہاؤز میں وزیر اعلیٰ نے جو قرارداد تعزیت پیش کی ہے، ایم آئی ایم کی طرف سے میں اس کی تائید کرتے ہوئے ان کے افرادِ خاندان سے اظہارِ ہمدردی کرتا ہوں۔ شکریہ۔

శ్రీ పువ్వాడ అజయ్ కుమార్ (ఖమ్మం): అధ్యక్షా, గౌరవ పాలేరు శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు మా జిల్లాకు రాజకీయంగా, కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కు అయిన రాంరెడ్డి వెంకటరెడ్డి గారు మార్చి 4వ తేదీన మరణించడం చాలా దిగ్భ్రాంతికి గురిచేసింది.

**10.20 ఉ.** గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. వెంకట రెడ్డి గారికి నాలుగు విషయాలంటే చాలా ఇష్టం . కాంగ్రెస్ పార్టీ అంటే చాలా ఇష్టం . ఖమ్మం జిల్లా ప్రజలంటే కూడా చాలా ఇష్టం . దానితోపాటు మంత్రులు, ముఖ్యమంత్రులు చెప్పిన విధంగా వ్యవసాయం, పశుపోషణ అన్నా వారికి చాలా ఇష్టం. వారి చివరి ప్రయాణం ఖమ్మం జిల్లాలోని భద్రాచలంలోని రామాలయానికి వెళ్లడం జరిగింది. రామాలయంలోని సీతా రామచంద్రమూర్తి అంటే ఆయనకు యెనలేని భక్తి మరియు ప్రేమ. వారు ఒక ప్రజానేతగా , కాంగ్రెస్ పార్టీకి నేతగానే కాకుండా పార్టీకి విధేయుడైన కార్యకర్తగా ఇన్ని దశాబ్దాలపాటు పని చేశారు. తన రాజకీయ జీవితంలో భోళా శంకరుడిగా, ప్రజలకు అత్యంత సన్నిహితమైన వ్యక్తిగా పేరు తెచ్చుకున్న వ్యక్తి.

మొట్టమొదటిసారి వారు ఉపఎన్నికలలోనే గెలిచారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రజబలీగారు మరణించినప్పుడు, వారి మరణం తరువాత వచ్చిన ఉప ఎన్నికలలో గెలిచి మూడు సంవత్సరాలు ఆయన శాసనసభ్యుడిగా ఉన్నారు. తరువాత మరోసారి సుజాతనగర్‌కు ప్రాతినిధ్యం వహించి రెండుసార్లు గెలిచారు. సుజాతనగర్ నియోజకవర్గం డీలిమిటేషన్‌లో కనుమరుగు అయిన తరువాత పాలేరు నియోజకవర్గం నుండి 2009లో గెలిచారు. మరల 2014లో అత్యంత మెజారిటీతో గెలిచారు. ఈ టర్మ్ పూర్తి స్థాయిలో వారు అధికారంలో ఉంటారని మేము నమ్మకంతో ఉన్నాము. చిట్టచివరిసారిగా ఖమ్మం వచ్చినప్పుడు 2019లో కూడా నేనే పోటీ చేస్తానని ఒక ప్రకటన చేస్తే మేమంతా చాలా సంతోషించాము. ఆయన చాలా ధైర్యవంతుడు. నాలుగున్నర సంవత్సరాల క్రితం లంగ్ క్యాన్సర్ డిటెక్ట్ అయినప్పుడు వారి సన్నిహితులు చాలా తీవ్రమైన వ్యాధి అని

చెప్పినా కూడా ప్రజలలో ఆ సంకేతం రాకుండా చాలా ధైర్యంగా ఉండి ప్రజలకు కాంగ్రెస్ పార్టీకి ధైర్యం ఇవ్వడం జరిగింది. నాలుగున్నర సంవత్సరాలుగా వారికి ట్రీట్‌మెంట్ జరుగుతున్నా వారికి ఉన్న అసౌకర్యాన్ని ప్రజలకు కాని, కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు కాని తెలియనివ్వకుండా కాలం గడిపారు. మరణానికి భయపడని వ్యక్తి రాంరెడ్డి వెంకట రెడ్డిగారు. వారు లేని లోటు నిజంగా తీర్చలేనిది. వారికి పశువుల మీద ఉన్న ఆపేక్ష గురించి మీరందరూ చెప్పారు.

ఈ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రిగారికి విన్నవించేది ఏమిటంటే, మా ఖమ్మం జిల్లాలో వెటర్నరీ కాలేజీ ఆధ్వర్యంలో ఒక కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. దానికి సంబంధించి గతంలో మా మంత్రిగారిని కూడా అడిగాను. ఇప్పుడు సమయం ఈ రకంగా వచ్చింది కాబట్టి ఆ కృషి విజ్ఞాన కేంద్రాన్ని వారి స్వస్థలం అయిన కామేపల్లి మండలంలోని లింగాలలో ఏర్పాటు చేసి దానికి రాంరెడ్డి వెంకటరెడ్డిగారి పేరు పెట్టాలని మీ ద్వారా గౌరవ ముఖ్యమంత్రిగారిని అర్థిస్తున్నాను. నా వ్యక్తిగత అభ్యర్థన ఏమిటంటే, గతంలో అనేకసార్లు సీనియర్ శాసనసభ్యులు మరణించినప్పుడు, ఉపఎన్నికలను నివారించాలనే ఉద్దేశ్యముతో, అలాగే వారు చేసిన సేవలను దృష్టిలో పెట్టుకొని ఎన్నికలను ఏకగ్రీవంగా చేసుకునే సాంప్రదాయం ఉండేది. ఈ సందర్భంగా మీద్వారా ముఖ్యమంత్రిగారిని, టిఆర్ఎస్ పార్టీని, తెలుగుదేశం పార్టీని, వామపక్ష పార్టీలను, వైఎస్ఆర్‌సిపి పార్టీని మరియు ఇతర పార్టీలను కూడా కోరుతున్నాను. ఈ ఎన్నికలను వారి కుటుంబంలో మా పార్టీ సూచించిన వ్యక్తికి ఏకగ్రీవంగా ఎన్నుకునేల మీరంతా సహకరించాలని కోరుతున్నాను. గతంలో ఉన్న రాజకీయ పరిస్థితులు వేరు. ఇప్పుడు టిఆర్ఎస్ పార్టీకి నెంబర్ కూడా అంత పెద్ద విషయం కాదు. ఇప్పుడు మీరు మెజారిటీలో ఉన్నారు. టిడిపి పార్టీని టిఆర్ఎస్‌లోకి విలీనం చేసే రూలింగ్‌ను కూడా ఇచ్చారు. ప్రజా క్షేత్రంలో అనేక ఎన్నికలలో మీరు విజయ పరంపర కొనసాగిస్తున్నారు. కాబట్టి ప్రత్యేకించి నిరూపించుకోవలసిన అవసరం లేదు. కాబట్టి రాంరెడ్డి వెంకటరెడ్డిగారి సేవలను దృష్టిలో పెట్టుకొని, ఆ ప్రాంత ప్రజల ఆకాంక్షలను గుర్తు పెట్టుకొని దయచేసి ఈ ఎన్నిక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వారి కుటుంబం నుండి ఎవరూ నిలబడినా మీరంతా సహకరించాలని కోరుతున్నాను. ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానానికి మద్దతు ఇస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను.

శ్రీ సండ్ర వెంకట వీరయ్య (సత్తుపల్లి): అధ్యక్షా, దివంగత నాయకులు పాలేరు శాసనసభ్యులుగా ఉన్న రాంరెడ్డి వెంకటరెడ్డిగారు సుదీర్ఘ అనుభవం కలిగిన వ్యక్తి. సుజాతనగర్ నుండి మూడు సార్లు గెలిచారు. సుదీర్ఘ అనుభవం కలిగిన రైతు బాంధవుడు, గిరిజనుల ఆరాధ్యదైవం రాంరెడ్డి వెంకటరెడ్డిగారి అకాల మరణానికి ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, వారి జిల్లాలో నిరుపేదల పక్షాన దొరగా పేరు సంపాదించుకున్నారు. వారిని దొరగారు అని పిలిచినా ఆ లక్షణాలు లేకుండా అత్యంత నిరుపేదల యొక్క ఏ చిన్న కార్యక్రమం వచ్చినా అక్కడ తప్పనిసరిగా భోజనం చేసే మంచి వ్యక్తి. అందుకే నిరుపేదలు ఎక్కువగా ఉన్న సుజాతనగర్ నియోజక వర్గంలో మూడుసార్లు గెలిచారు. పాలేరు నుండి కూడా రెండు సార్లు గెలుపొందడం గొప్ప విషయం. ప్రజలలో ముఖ్యంగా క్రింది వర్గాలలో ఉన్న అభిమానమే ఆయన గెలుపుకు నిదర్శనం. ఆయన ఎక్కడ ఎడ్ల పందేలు జరిగినా ఒంగోలు జాతి గిత్తలను తీసుకువెళ్లి మొట్టమొదటి స్థానం గెలిచే విధంగా, వాటి పట్ల ఆదరణ చూపించిన వ్యక్తి. వ్యవసాయం పట్ల మక్కువ ఎక్కువ. ఒక నిండైన విగ్రహం పంచె కట్టుతో, రైతుకు నిలువుటద్దంగా కనపడేవారు. ఏ టైమ్ అయినా లింగాల స్వగ్రామం వెళ్లడం, వ్యవసాయం చూసుకున్న తరువాత రాజకీయ కార్యకలాపాలలో నిమగ్నమయ్యేవారు. వారి ఆకస్మిక మరణానికి తెలుగుదేశం పార్టీ తరపున సంతాపం తెలుపుతూ, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

డా. కె. లక్ష్మణ్ (ముషీరాబాద్): అధ్యక్షా, సీనియర్ శాసనసభ్యులు రాంరెడ్డి వెంకటరెడ్డిగారి అకాల మరణం పట్ల గౌరవ ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని బిజెపి పార్టీ వైపు నుండి బలపరుస్తున్నాను. సర్పంచ్‌గా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించి అయిదుసార్లు శాసనసభ్యునిగా గెలవడం అంటే ప్రస్తుత కాలమాన రాజకీయ పరిస్థితులలో విలువలతో కూడుకున్న రాజకీయాలను ఎదుర్కొంటూ వారు నమ్మినటువంటి సిద్ధాంతాలకు అనుగుణంగానే పార్టీలో కొనసాగుతూ వచ్చారు. ఇంతకుముందు చెప్పినట్టుగా అసలు సిసలైన రైతుబిడ్డగా తన కట్టు, బొట్టు, పంచెకట్టు అందరినీ ఆకర్షించేదిగా ఉండేది. వారి యొక్క వేష, భాషలలో తెలుగుతనం ఉట్టిపడేది. వారి యొక్క మరణం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. కాబట్టి వారికి వ్యవసాయం, పశుపోషణ మీద ఉన్న ప్రత్యేకత కొనియాడదగింది. ఒంగోలు గిత్తలను పెంచడానికి, బ్రీడింగ్ సెంటర్‌ను వారి గ్రామంలో ఏర్పాటు చేశారు. తెలుగు రాష్ట్రాలలో ఎక్కడ ఎద్దుల పోటీలు జరిగినా వారికి

సంబంధించిన గిత్తలకే బహుమతులు రావడం అనేది నిజంగా వారికి పశువుల పట్ల ఉన్న మక్కువ తెలుపుతుంది. వారి మరణం కేవలం కాంగ్రెస్ పార్టీకి మాత్రమే కాదు, కొత్తగా ఏర్పడ్డ మన తెలంగాణ రాష్ట్రానికి అటువంటి సీనియర్ శాసనసభ్యుడు దాదాపు నాలుగు దశాబ్దాలుగా రాజకీయాలు నడిపిన వ్యక్తి లేకపోవడం తీరనిలోటుగా మేము భావిస్తున్నాము. భగవంతుడు వారి ఆత్మకు శాంతి చేకూర్చడమే కాకుండా శోకార్తులైన వారి కుటుంబసభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని, ఆత్మస్థైర్యాన్ని కలిగించాలని కోరుతూ సెలవు తీసుకుంటున్నాను.

10.30 ఉ. శ్రీ బి. మధన్ లాల్ (వైర) : అధ్యక్షా, ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని సమర్ధిస్తున్నాను. పెద్దలు రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారి శిష్యుల్లో నేను ఒకడిని. శ్రీ రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనేవారు. వారు గిరిజన ప్రజల మధ్య ఉండేవారు. వారు చేసే సేవా కార్యక్రమాలకు ప్రభావితుడనై 1985వ సంవత్సరంలో ఎంఎల్‌ఏ సీట్‌కు నామినేషన్ వేసిన సందర్భంగా, నా ప్రభుత్వోద్యోగానికి రాజీనామా చేసి వారితో వెళ్లాను. అప్పటి నుండీ మొన్న చనిపోయే వరకూ వారితో నా అనుబంధం కొనసాగింది. ఆయన నిజమైన గిరిజన నాయకుడు. సుజాతనగర్ నియోజకవర్గంలో అత్యధిక శాతం ప్రజలు లంబాడి జాతికి చెందినవారే. సుమారు 58,000 ఓట్లతో, నియోజకవర్గంలో గెలుపొందిన లంబాడి నాయకుడు ఎవరంటే రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు అనేవారు. ఆయన్ని రాంరెడ్యా అని సంబోధించేవారు. వారు నిజంగా ఆ ప్రాంతంలో మొండి పట్టుదలతో, స్వయంకృషితో ఎదిగారు. శాసనసభ్యునిగా ఓడిపోయాను అని తెలిసినప్పటికీ, మరుసటి రోజునండీ ఆయన మళ్లీ నియోజకవర్గంలో తిరిగిన సందర్భాలను నేను స్వయంగా చూశాను. అటువంటి ప్రజల మేలు కోరుకున్న నాయకుడు మన మధ్య లేకపోవడం మనకు తీరని లోటు. ఫార్మసీ సీటు కోసం రెండు వందల రూపాయలు తగ్గించమని ఇద్దరు గిరిజన వ్యక్తులు ఉదయాన్నే వారి ఇంటికి వచ్చినప్పుడు, వారితోబాటు కాలేజీకి వెళ్లి, కాలేజి యాజమాన్యంతో, వారు పేదవారు, రెండు వందల రూపాయలు తగ్గించండని విన్నవించారంటే, వారికున్నటువంటి అంకితభావం ఎటువంటిదో మనం అర్థం చేసుకోవాలి. అటువంటి మహానాయకుడికి వ్యవసాయం అంటే మక్కువ ఎక్కువ. రోజూ ఉదయం 5.30 గంటలకే రెడీ అయ్యేవారు. అనేక మంది పేద ప్రజలు ఆ సమయానికి వారింటికి వచ్చేవారు. పేద ప్రజల కోసం అంకితభావంతో పనిచేసిన నాయకుడు మనమధ్య లేకపోవడం బాధాకరం. వారి సంతాప తీర్మానం గురించి నేను మాట్లాడవలసి వస్తుందని ఊహించలేదు. అటువంటి నాయకుడు మన మధ్య లేకపోవడం మనకు తీరని లోటు. గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని బలపరుస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడుని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

**డా.జి.చిన్నారెడ్డి (వనపర్తి): అధ్యక్షా, సీనియర్ శాసనసభ్యుడు శ్రీ రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు అకాల మరణం పొందిన సందర్భంలో ఈరోజు గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రతిపాదించిన సంతాప తీర్మానానికి హృదయపూర్వకంగా మద్దతు తెలియజేస్తున్నాను. నాకంటే ముందు మాట్లాడిన పెద్దలు చెప్పినట్లుగా, శ్రీ రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు రైతుబంధావుడిగా పేరు తెచ్చుకున్నారు. వారు ప్రాతినిధ్యం వహించినటువంటి నియోజకవర్గంలో అత్యధిక జనాభా ఉన్న గిరిజనులకు నాయకుడిగా ఉంటూ, వారికి అనేక సేవలు అందించడం జరిగింది. ఆయన లంగ్ క్యాన్సర్‌తో దాదాపు నాలుగు సంవత్సరాల నుండి బాధ పడుతున్నా ఏ ఒక్క రోజైనా వారి బాధను పక్కవారికి కూడా తెలియనివ్వలేదు. వారు, నియోజకవర్గ వ్యవహారాలలో, శాసనసభ వ్యవహారాలలో, పార్టీ వ్యవహారాలలో చాలా చురుగ్గా పాల్గొనేవారు. వారు, సర్పంచ్‌గా రాజకీయ జీవితాన్ని మొదలుపెట్టి కేబినెట్ మంత్రి వరకూ ఎదిగారు. మూడు పర్యాయాలు సుజాతానగర్ నుండి, రెండు పర్యాయాలు పాలేరు నుండి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారు. వారితో నాకు ముప్పై అయిదు సంవత్సరాల నుండి పరిచయం ఉంది. 1980లో ఆ రోజు కాంగ్రెస్ యువజన విభాగంలో వారి తమ్ముడు శ్రీరాంరెడ్డి దామోదర్ రెడ్డి గారితో కలసి, ఇప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ గారితో కూడా కలసి ఆ కార్యవర్గంలో మేము పనిచేశాము. ఆరోజు నుండీ నాకు రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారితో పరిచయం ఉందని మనవి చేస్తున్నాను. వారి దగ్గరకు ఎప్పుడు వెళ్లినా, వారు వ్యవసాయం గురించి చర్చించేవారు. మీ జిల్లాలో వర్షాలు ఏ విధంగా ఉన్నాయి, వ్యవసాయం ఎలా ఉంది, పంటలు బాగా పండుతున్నాయా అని చర్చించేవారు. గతంలో కిరణ్‌కుమార్ రెడ్డి గారి నాయకత్వంలో వారు హార్టీకల్చర్ మినిస్టర్‌గా పనిచేయడం జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రిగా కూడా ఆయన పనిచేశారు. అప్పుడు వారితో కలసి పనిచేసే అవకాశం దక్కింది. లక్ష్మణ్ గారు చెప్పినట్లు, వారి మరణం కాంగ్రెస్ పార్టీకే కాకుండా, రాష్ట్రంలో ఉన్న రైతాంగానికి, మరీ ముఖ్యంగా వ్యవసాయాన్ని అభిమానించే వారికి తీరని లోటు అని సవినయంగా మనవి చేస్తున్నాను. వారికి పశువులంటే అపారమైన

** An asterisk before the name indicates confirmation by the Member.

ప్రేమ. ఒంగోలు జాతి ఎద్దులను పెంచడం వారి హాబీ. ఎక్కడ పోటీలు జరిగినా, స్వయంగా వారు ఆ పశువులను వెంట తీసుకొని వెళ్లి మొదటి బహుమతి వచ్చేవరకూ శ్రమించేవారు. మిత్రుడు అజయ్‌కుమార్ గారు చెప్పినట్లు, వారు వ్యవసాయానికి, పశుపోషణకు చేసిన సేవకు గుర్తుగా పాలిటెక్నిక్ కాలేజీకి లేదంటే ఏదైనా వ్యవసాయానికి సంబంధించిన ఒక సంస్థకి వారి పేరు చిరస్థాయిగా ఉండే విధంగా చర్య తీసుకోవాలని గౌరవ ముఖ్యమంత్రి గారికి సవినయంగా మనవిచేస్తున్నాను. వారి మృతికి నా సంతాపాన్ని తెలియజేస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని మనసారా కోరుకుంటున్నాను.

మిస్టర్ స్పీకర్ : ఖమ్మం జిల్లా, పాలేరు శాసనసభ్యులు ప్రజాపద్దుల కమిటీ అధ్యక్షులు శ్రీ రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారి ఆకస్మిక మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి ..........

(ఈ సందర్భంగా శ్రీ పాయం వెంకటేశ్వర్లు, శ్రీ సున్నం రాజయ్య తమకు మాట్లాడే అవకాశం ఇవ్వాలని కోరారు)

శ్రీ పాయం వెంకటేశ్వర్లు (పినపాక): అధ్యక్షా, సీనియర్ శాసనసభ్యులు శ్రీ రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారి మరణం పట్ల గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పక్షాన బలపరుస్తున్నాను. రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారి రాజకీయ ప్రస్థానం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా మొదలయ్యింది. ఖమ్మం జిల్లాకు సంబంధించి మాస్ లీడర్‌గా మంచిపేరు తెచ్చుకున్న వ్యక్తి శ్రీ రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు. ఆయన పేరు చెప్పగానే ఖమ్మం జిల్లా వారికి గుర్తుకొచ్చేది ఒంగోలు గిత్తలు, పాడి పశువులు, వ్యవసాయం. ఎక్కడ పోటీలు జరిగినా రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు, వారి ఎద్దులను తీసుకెళ్లి మొదటి బహుమతి తెచ్చుకునేవారు. ఆ పశువుల పట్ల, వ్యవసాయం పట్ల వారికున్న ప్రేమ ఖమ్మం జిల్లా ప్రజలకు తెలిసిన విషయమే.

**10.40 ఉ.** రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు 1984-1989-1994 ఎన్నికలలో ఓటమి చూసినప్పటికీ 1996లో సీనియర్ కమ్యూనిస్టు నేతగా ఆనాడు సుజాతానగర్ ఎమ్మెల్యేగా ఉన్నటువంటి రజబ్ ఆలీ గారి మరణంతో ఉపఎన్నిక వచ్చిన సందర్భంలో రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు ఆ ఉప ఎన్నికలలో గెలవడమే కాకుండా ఆనాటి నుంచి నేటి వరకు అపజయమంటే ఏమిటో తెలియని వ్యక్తిగా విజయాలతో ముందుకెళ్తూ ఎన్నో పదవులను వారు అధిరోహించారు. దివంగత ముఖ్యమంత్రి డా.వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డిగారి ప్రభుత్వంలో మంత్రిగా పనిచేశారు. ఖమ్మం జిల్లాలో రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారంటే ఆదివాసీల ముద్దుబిడ్డగా, ఆదివాసీల కుటుంబంలో ఒక సభ్యుడిగా మెలిగినటువంటి వ్యక్తి. ఎందుకంటే ఏ గిరిజన గూడేనికి వెళ్లినా, లంబాడీ తండాకు వెళ్లినా కూడా ప్రతి కుటుంబంలోని వ్యక్తిని స్వయంగా పేరుపెట్టి పిలిచే వ్యక్తిగా ఖమ్మం జిల్లాలో వారికి గుర్తింపు ఉండటమే కాకుండా ప్రజలతో అత్యంత సన్నిహితంగా ఉండేవారు. గిరిజనుల సమస్యల పట్ల, గిరిజనేతరుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వంతో, శాసనసభలో మాట్లాడుతూ ఆ ప్రాంత అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన వ్యక్తి.

దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి గారంటే అమితమైన ప్రేమ ఉన్న వ్యక్తి. రాజశేఖర్‌రెడ్డి గారి మహా ప్రస్థానం ఖమ్మం జిల్లాలో కొనసాగించినప్పుడు వారితోబాటు రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు కూడా ఖమ్మం జిల్లా వ్యాప్తంగా పాదయాత్రలో పాల్గొని వారిపట్ల ఉన్న అభిమానాన్ని చూరగొన్నారు. అంతే కాకుండా వారు మంత్రిగా పనిచేసిన సందర్భంలో 2004-2009 అసెంబ్లీ ఎన్నికలలో నేను కూడా ఎమ్మెల్యేగా ఉన్నందున వారితో నాకు ఎక్కువ పరిచయమున్నది. వారు ఎక్కడ కలిసినా చిరునవ్వుతో ఆప్యాయంగా పలకరించేవారు. కేవలం ఖమ్మం జిల్లాలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా మితవాది, వివాదరహితుడిగా వారికి మంచి పేరున్నది. వారు ఏ సమావేశంలో పాల్గొన్నా రాజశేఖర్ రెడ్డిగారి పేరు ప్రస్తావించడమే కాకుండా వారి సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుంటూ వారి పట్ల ఉన్న ప్రేమను ఏ రకంగా కనబర్చేవారో అర్థమవుతుంది. అటువంటి వ్యక్తి మరణించడం కేవలం ఖమ్మం జిల్లాకే తీరని లోటు కాదు రాష్ట్రానికే తీరని లోటుగా నేను భావిస్తున్నాను. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వై.ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ తరుపున తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ సున్నం రాజయ్య (భద్రాచలం): అధ్యక్షా, రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారి అకాల మరణానికి సంబంధించిన సంతాపాన్ని గౌరవ ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టినందుకు సి.పి.ఎం పార్టీ తరపున బలపరుస్తూ రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు సర్పంచ్ నుంచి మంత్రి వరకు రాజకీయ ప్రస్థానం ఉన్న నాయకుడు. సర్పంచ్‌గా రెండు పర్యాయాలు, అదే విధంగా అయిదు పర్యాయాలు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఒక పర్యాయం, సుజాతానగర్ నియోజకవర్గానికి మూడు పర్యాయాలు, పాలేరుకు రెండు పర్యాయాలు ప్రాతినిధ్యం

వహించారు. రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు చాలా మంచి మనిషి. గిరిజనుల దగ్గరికి వెళ్లినప్పుడు వారు అక్కడ ఏ రకమైన ఆహారం పెట్టినా సరే తినడమే కాకుండా వారితో మమేకమయ్యేవారు. నేను రాజకీయాలలోకి వచ్చిన 20 సంవత్సరాల నుంచి అత్యంత ఆప్తుడుగా, మిత్రుడిగా ఉండటమే కాకుండా జిల్లాకు సంబంధించి ఏ సమావేశంలో కలిసినా ఖమ్మం జిల్లా సమస్యల గురించి చెప్పమనేవారు. వారు చిరునవ్వుతో పలకరించే వ్యక్తి, వారి మరణం కేవలం కాంగ్రెస్ పార్టీకే కాదు మా ఖమ్మం జిల్లా మొత్తానికి తీరని లోటు. రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు అపారమైన అనుభవమున్న వ్యక్తి కాబట్టి రాష్ట్రానికి కూడా తీరని లోటుగా నేను భావిస్తూ వారి మరణం పట్ల సి.పి.ఎం పార్టీ తరుపున ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఆర్. రవీంద్ర కుమార్ (దేవరకొండ): అధ్యక్షా, సీనియర్ శాసనసభ్యులు రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారి సంతాప తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టిన మన గౌరవ ముఖ్యమంత్రి గారికి కృతజ్ఞతలు తెలియజేస్తూ సి.పి.ఐ పార్టీ తరపున మేం కూడా ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాం. రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారి జీవిత ప్రస్థానం గురించి తెలుసుకుంటే చాలా ఆశ్చర్యమేస్తున్నది. ఎందుకంటే రెండు పర్యాయాలు గ్రామపంచాయతీ సర్పంచిగా, ఒక పర్యాయం పి.ఏ.సి ఛైర్మన్‌గా ఉండటమే కాకాకుండా పంచాయతీరాజ్ వ్యవస్థకు సంబంధించి గ్రామీణ ప్రాంతాలలో ఉండే అనేక సమస్యల గురించి అవగాహన కలిగిన వ్యక్తిగా సుజాతానగర్ నియోజకవర్గం నుండి ఆనాటి సీనియర్ కమ్యూనిస్టు నేత రజబ్ అలీ గారితో పోటీచేసి ఓడిపోయినా మొక్కవోని ధైర్యంతో రజబ్ అలీ గారు మరణించిన తరువాత ఉప ఎన్నికలో వారు గెలవడమే కాకుండా అప్పటి నుంచి నేటివరకు వరుసగా అయిదు పర్యాయాలు శాసనసభ్యుడిగా, మంత్రిగా, పి.ఏ.సి కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు.

రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారి పంచకట్టు, మీసకట్టు చూస్తే వ్యవసాయంలో అపారమైన అనుభవం కలిగిన వ్యక్తిగా కనబడేవారు. వారు క్యాన్సర్ వ్యాధితో మరణించడం చాలా దురదృష్టకరం. వెంకట్‌రెడ్డి గారు దాదాపు నలభై సంవత్సరాలు ప్రజా క్షేత్రంలో ప్రజలకు సేవ చేశారు. ఏది ఏమైనా ఖమ్మం జిల్లా శాసనసభ్యులు పువ్వాడ అజయ్ కుమార్ గారు చెప్పినట్లుగా వ్యవసాయానికి సంబంధించి వారు చేసిన అనేక కార్యక్రమాలను గుర్తించి ఖమ్మం జిల్లాలో వారి జ్ఞాపకార్థం ఒక కార్యక్రమాన్ని ఏర్పాటుచేసి వారి పేరు చిరస్థాయిగా నిలబడే పద్ధతిలో గౌరవ ముఖ్యమంత్రి గారు ఆలోచన చేయాలని సి.పి.ఐ పార్టీ తరుపున భావిస్తూ, రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారి మరణం పట్ల తీవ్రమైన సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

డా.జె.గీతారెడ్డి (జహీరాబాద్): అధ్యక్షా, రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారి గురించి మాట్లాడటమంటే నిజంగానే బాధపడుతూ, మంచి ఆదర్శం కలిగిన వ్యక్తి మన మధ్యలో లేకపోవడం, ఈ తొలి తెలంగాణ రాష్ట్ర శాసనసభలో వారు లేకపోవడం చాలా బాధాకరం. రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు అందించిన సేవలను మనం గుర్తించాల్సిన అవసరం చాలా ఉన్నది. గౌరవ ముఖ్యమంత్రి గారు పెద్ద మనసుతో ఆలోచించి చిరస్థాయిగా వారి జ్ఞాపకార్థం ఏదైనా ఏర్పాటు చేస్తే బాగుంటుంది. ఎందుకంటే ఇలాంటి రాజకీయవేత్తలు ఈ తరానికే కాకుండా వచ్చే తరానికి కూడా ఆదర్శంగా నిలుస్తారని భావిస్తున్నాను. రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు లాస్ట్ సెషన్‌లో నా బెంచ్‌మేట్, అందుకే ఆ బాధ. చాలా సౌమ్యంగా, ఆప్యాయతతో పలకరించేవారు. వారికి వ్యవసాయం మీద ఉన్న పట్టు చాలా ఆశ్చర్యచకితులను చేస్తున్నది. వ్యవసాయం గురించి వారికి సవివరమైన అవగాహన ఉన్నది. నేనొక డాక్టర్‌గా క్యాన్సర్ పేషెంట్లను చాలామందిని చూసిన వ్యక్తిని అయిన ప్పటికీ రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారు క్యాన్సర్‌తో బాధపడుతున్నప్పటికీ ధైర్యంగా తట్టుకున్న ఏకైక వ్యక్తి అని నేను భావిస్తున్నాను. అతనికి క్యాన్సర్ ఉందనే భావన కూడా ఎవరికీ కలిగించేవారు కాదు. ఎందుకంటే ఎన్నోమార్లు కీమో థెరపీ తీసుకున్నారు. కీమో థెరపీ తీసుకున్న తరువాత మనిషి శారీరకంగా, మానసికంగా ఎంత బలహీనపడిపోతారనేది అందరికీ తెలిసిందే అయినప్పటికీ పక్కన కూర్చున్న నాకు కూడా వారికి క్యాన్సర్ ఉన్నదనే భావన కూడా నాకెప్పుడు కలిగేది కాదు. ప్రతి ఒక్కరినీ అదే చిరునవ్వు, అదే ఆప్యాయతతో పలకరించేవారు. అన్నకు క్యాన్సర్ ఉన్నదని కూడా మేం ఎప్పుడూ అనుకునేవాళ్లం కాదని, వారు ఎప్పుడు మామూలుగా ధైర్యంగా ఉండేవారని, "జో డర్‌గయా ఓ మర్‌గయా" అని చెప్పేవారని వారి తమ్ముడు చెప్పారు. ఒక పక్కన క్యాన్సర్‌తో బాధ పడుతూ కూడా "జో డర్‌గయా ఓ మర్‌గయా" అని ముందుకెళుతూ వారి ఆరోగ్యాన్ని ఎంతవరకు చేతనైందో అంతవరకు కాపాడుకుంటూ సడన్‌గా మన మధ్యలో లేరంటే నిజంగా ఇది కేవలం కాంగ్రెస్ పార్టీకే కాదు రాజకీయాలలో ఉన్న ప్రతి ఒక్కరికీ తీరని లోటుగా భావిస్తూ అటువంటి వ్యక్తిని మనం ఈరోజు స్మరించుకుంటున్నాం, వారు చిరస్మరణీయులు, వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్నివ్వాలి. వారిని కోల్పోయిన వెలితి వారి కుటుంబ సభ్యులకు ఎప్పుడూ ఉంటుంది. భగవంతుడు తప్పకుండా వారి ఆత్మకు శాంతిని కలిగిస్తాడని భావిస్తూ సెలవు తీసుకుంటున్నాను.

10.50 ఉ. శ్రీ తాటి వెంకటేశ్వర్లు (అశ్వారావుపేట): అధ్యక్షా, సీనియర్ శాసన సభ్యులు రాంరెడ్డి వెంకటరెడ్డి గారి మృతి పట్ల గౌరవ ముఖ్య మంత్రి గారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ పక్షాన బలపరుస్తూ, రాంరెడ్డి వెంకటరెడ్డి గారి రాజకీయ ప్రస్థానం ఖమ్మం జిల్లాలో గ్రామ పంచాయితీ సర్పంచ్‌గా సుదీర్ఘకాలంపాటు రాజకీయాల్లో పాల్గొన్నటువంటి నేతగా, మాస్ లీడర్‌గా ఒక మంచి పేరు ఉన్న వ్యక్తి. వారంటే ఖమ్మం జిల్లాలో గుర్తుకు వచ్చేది ఒంగోలు గిత్తలు, పాడి పశువులు, వ్యవసాయం. వారన్నా, వారి కుటుంబమన్నా ఒంగోలు గిత్తలకు బ్రాండ్‌గా ఉండేది. రాష్ట్రంలో ఎక్కడ ఎద్దుల పోటీలు జరిగినా ఆయన ఎద్దులను తీసుకువెళ్లి ప్రథమ బహుమతిని గెలుచుకునేవారు. పశువుల పట్ల, వ్యవసాయం పట్ల, పాడి పశువుల పట్ల వారికున్న మక్కువ ఖమ్మం జిల్లా ప్రజలందరికీ కూడా తెలుసు. 1984,1989,1994 ఎన్నికల్లో ఓటమి చూసినప్పటికీ 1996వ సంవత్సరంలో సీనియర్ కమ్యూనిస్ట్ నేతగా ఆనాడు సుజాతనగర్ ఎమ్.ఎల్.ఏ గా ఉన్నటువంటి రజబలి గారి మరణంతో ఉప ఎన్నిక వచ్చిన సందర్భంలో వారు ఆ ఉప ఎన్నికల్లో గెలిచి ఆనాటి నుండి నేటి వరకు అపజయం అంటే ఏంటో తెలియని వ్యక్తిగా విజయాలతో ముందుకు వెళుతూ వారు పదవులను అధిరోహించారు. దివంగత ముఖ్య మంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి ప్రభుత్వంలో మంత్రిగా పని చేశారు. ఖమ్మం జిల్లాలో రాంరెడ్డి వెంకటరెడ్డిగారంటే ఆది వాసీల ముద్దుబిడ్డ. ఆదివాసీల కుంటుంబాల్లో సభ్యునిగా మెలిగిన వ్యక్తి. ఏ గిరిజన గూడానికి, లంబాడి తండాలకు వెళ్లినా ప్రతి కుటుంబంలో వ్యక్తిని స్వయంగా పేరు పెట్టి పిలిచే వ్యక్తిగా ఖమ్మం జిల్లాలో వారికి ఆ పేరుంది. అంత ఆప్యాయత, ప్రేమతో మెలిగిన వ్యక్తి వారు. గిరిజన సమస్యల పట్ల, గిరిజనేతరుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తరపు నుంచి శాసనసభలో మాట్లాడుతూ ఆ ప్రాంత అభివృద్ధి పట్ల నిరంతరం శ్రమించిన వ్యక్తి. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గారంటే అమితమైన ప్రేమ ఉన్నటువంటి వ్యక్తి. ఖమ్మం జిల్లాలో రాజశేఖర్ రెడ్డి గారు మహా ప్రస్థానం మొదలు పెట్టినప్పుడు వారితో కలసి పాదయాత్ర చేసిన వ్యక్తి. వారి పట్ల అభిమానాన్ని ఆ విధంగా చూరగొన్నారు. మంత్రిగా పని చేసిన సందర్భంలో మరియు 2004 సంవత్సరంలో శాసనసభ్యుడిగా వారు పని చేసిన సందర్భంలో నేను ఎమ్.ఎల్.ఏగా ఉన్నాను మరియు వారితో నాకు మంచి పరిచయం ఉన్నది. ఎక్కడ కలిసినా కూడా చిరునవ్వుతో పలకరిస్తూ, ఆప్యాతతో మంచితనంగా మాట్లాడే వ్యక్తి. మిత వాదిగా, వివాదరహితుడని ఖమ్మం జిల్లాలో, రాష్ట్రంలో కూడా మంచి పేరుంది. వారు ప్రజల్లోకి వెళ్లినప్పుడు ఏ సమావేశానికి వెళ్లినా వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి గారి గురించి పేరు తీయకుండా మాట్లాడేవారు కాదు. వారి పేరును తెలుపుతూ వారి సంక్షేమ పథకాలను గుర్తు చేస్తూ వారి పట్ల ఉన్న ప్రేమను ఏ రకంగా కనపరిచేవారో ఈ విషయాలను చూస్తే అర్థమవుతోంది. అటువంటి వ్యక్తి మరణించడం ఖమ్మం జిల్లాకే కాక యావత్తు తెలంగాణ రాష్ట్రానికే తీరని లోటు అని నేను భావిస్తున్నాను. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి కోరుకుంటూ, వై.ఎస్.ఆర్. పార్టీ తరపు నుంచి నా సంతాపాన్ని తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ మల్లు భట్టి విక్రమార్క (మధిర): అధ్యక్షా, పెద్దలు రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారి అకాల మరణాన్ని తట్టుకోలేనటువంటి ఖమ్మం జిల్లా ప్రజా ప్రతినిధుల్లో నేను కూడా ఒకడిని. ఆయన మరణం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ, నేను కూడా రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారి సేవల్ని తమరి ద్వారా స్మరణం చేసుకోవాలని అనుకుంటున్నాను. ఆయన ఒక సామాన్య వ్యక్తిగా గ్రామ సర్పంచ్ స్థాయి నుండి ఆనాటి ఉమ్మడి రాష్ట్రంలో మంత్రి స్థాయికి ఎదిగిన గొప్ప ప్రజా ప్రతినిధి. వ్యవసాయం పట్ల, వ్యవసాయానుబంధ రంగాల పట్ల అమితమైనటువంటి ప్రేమ కలిగిన వ్యక్తి. గ్రామీణ ప్రాంతం నుండి వచ్చిన వ్యక్తిగా ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజల కష్టాల్ని, ప్రజల జీవనాధారాన్ని, ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని పూర్తిగా గమనించిన గొప్ప ప్రజా ప్రతినిధి.

కుటుంబం అన్నా, కాంగ్రెస్ పార్టీ అన్నా, ఖమ్మం జిల్లా అన్నా అమితమైన ప్రేమ కలిగిన గొప్ప నాయకుడు. మా అందర్నీ తమ్ముడూ అంటూ నోరారా పిలిచేవారు. మమ్మల్నే కాకుండా ఖమ్మం జిల్లాల్లో ఉన్న ఏ రాజకీయ పార్టీవారైనప్పటికీ ఆయన కన్నా వయసు తక్కువ ఉన్న వారందర్నీ తమ్ముడూ అంటూ ఒక కుటుంబ పెద్దలాగా అందరికీ ప్రేమను పంచిన ఒక గొప్ప ప్రజా ప్రతినిధి మరియు గొప్ప నాయకుడు.

ఆయన ప్రాతినిధ్యం వహించిన సుజాతనగర్ నియోజక వర్గంలో ఎక్కువ మొత్తంలో గిరిజన సోదరులు ఉన్నారు. ఆయన ఉదయమే లేచి రాత్రి 12 గంటల వరకు ఆయా గిరిజన తాండాల్లో తిరుగుతూ ఎప్పటికప్పుడు వాళ్ల బాధలను, కష్టాలను తెలుసుకుంటూ, వాటిని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకు వచ్చి వారి సమస్యలను పరిష్కరించడం కోసమే ఆయన మొత్తం జీవితాన్ని అంకితం చేశారు. అటువంటి శాసన సభ్యుడు, ప్రజా ప్రతినిధి

ఈరోజు లేకపోవడం నిజంగా చాలా బాధాతప్తమైన సన్నివేశం. ఈ పరిస్థితిలో మా సోదర శాసన సభ్యుడు అజయ్ కుమార్ గారు ప్రతిపాదించినట్లుగా ఆయన చేసిన సేవలకు ఒక ప్రజా ప్రతినిధి ఏ రకంగా ఉండాలో చేసి చూపించినటువంటి ఆయన జీవితాన్ని మార్గదర్శకంగా ఉండడం కోసం భవిష్యత్ తరాలకు ఆయన పేరు చిరస్థాయిగా ఉండేట్లుగా ఖమ్మం జిల్లాలో ప్రభుత్వానికి సంబంధించిన ఏదైనా ఒక ఇనిస్టిట్యూషన్‌కి ఆయన నామకరణం చేస్తే బాగుంటుందని తమరి ద్వారా ప్రభుత్వాన్ని కోరుతున్నాను. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను. ధన్యవాదములు.

శ్రీమతి డి.కె. అరుణ (గద్వాల): అధ్యక్షా, దివంగత శాసన సభ్యులు రాంరెడ్డి వెంకటరెడ్డి గారి అకాల మరణం పట్ల గౌరవ ముఖ్య మంత్రి గారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. సీనియర్ శాసన సభ్యులు, రైతు బాంధవుడు మరియు గిరిజన పుత్రుల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన రాంరెడ్డి వెంకటరెడ్డి గారి మరణం వల్ల ఈ రాష్ట్రం ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని మనవి చేస్తున్నాను. రైతు అంటే రాంరెడ్డి వెంకటరెడ్డిలాగ ఉండలానే విధంగా వారి పంచకట్టు, రైతుల పట్ల వారి మమకారం, వ్యవసాయం పట్ల అతనికి ఉన్న ఆసక్తి మనందరికి కూడా తెలుసు. పాడి పరిశ్రమ, పశు సంపదపై చాలా ఆసక్తిని కలిగి ఉండడంతోబాటుగా వాటికి సంబంధించిన అంశాలను కూడా ఆసక్తితో చర్చించేవారు. ఒంగోలు జాతి గిత్తల బ్రీడింగ్ యూనిట్‌ని వారి గ్రామంలో పెద్ద ఎత్తున ఏర్పాటుచేయడంతో బాటుగా వాటి పోషణ విషయంలో మరియు వాటిని ప్రాచుర్యంలోకి తేవడంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఈ రోజు ప్రతి జాతరలో కూడా ఒంగోలు గిత్త ఎద్దులచే బండలు లాగే పోటీలు జరుగుతున్నాయి. దాదాపు గత 15 సంవత్సరాలుగా మా జిల్లాలో, మా నియోజకవర్గంలో కూడా చాలా చోట్ల ఈ పోటీలను నిర్వహిస్తున్నాము. ఆ పోటీల ప్రారంభానికి లేదా ముగింపునకు వారు ప్రత్యక్షంగా హాజరయ్యేవారు. వారి ఒంగోలు గిత్తలు మిగతా వారందరికి కూడా స్ఫూర్తిగా ఉండేవి. ఆ గిత్తలను చూసి మిగతా రైతులు తాము కూడా ఒంగోలు గిత్తలను పెంచాలనుకునే వారు. ఏ పోటీల్లో అయినా గెలుపొందిన ఒంగోలు గిత్తలు ఎవ్వరివి అని అడిగితే వీరికి చెందిన గిత్తలనే చెప్పేవారు. రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారి కుటుంబానికి చెందిన గిత్తలే ఎప్పుడూ ప్రథమ బహుమతిని గెలుపొందేవి. మన రాష్ట్రంలోనే కాకుండా ప్రక్క రాష్ట్రాల్లో, కర్ణాటక రాష్ట్రంలో కూడా ఒంగోలు గిత్తల పోటీలు జరిగినప్పుడు కూడా వారు ఆ పోటీల్లో ఆసక్తిగా పాల్గొనేవారు. మొన్నటి రైతు భరోసా యాత్రలో ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గంలోని కూసుమంచి మండలంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఒంగోలు గిత్తల బండిలో మమ్ముల్నందరిని ఎక్కించుకొని వారే స్వయంగా బండిని నడుపుతూ తీసుకువెళ్లారు. వారికి గల ఆ ఆసక్తికి నాకు ఆశ్చర్యం కలిగింది. వారు అనారోగ్యంతో ఉన్నప్పటికి కూడా ఆ ఎర్రటి ఎండలో ఆసక్తిగా బండిని నడపడం మరియు ఉత్సాహంతో ఉండి రైతు పట్ల తనకు గల అభిమానాన్ని చాటుకున్న వ్యక్తి ఆయన. ఖమ్మం జిల్లాలోని 7 మండలాలు ఆంధ్రకు పోవడం పట్ల తీవ్ర మనస్తాపం మరియు ఆవేదన పడిన వ్యక్తిగా వారిని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉన్నది. ఎప్పుడు ఆ ఏడు మండలాల విషయం వచ్చినా చాలా తీవ్రంగా స్పందించేవారు. మా మండలాలను ఏవిధంగా పోగుట్టుకుంటామని, మా గిరిజనులకు అన్యాయం జరుగుతోందని తీవ్రంగా ఆవేదన పడిన వ్యక్తి ఆయన. పాలేరు నుంచి రెండు సార్లు మరియు సుజాత నగర్ నుంచి మూడు సార్లు వరుసగా శాసన సభ్యుడిగా ఎన్నికై ప్రజల్లో ప్రజానాయకుడిగా, ప్రజాబాంధవుడిగా వారి గుండెల్లో నిలిచిన రాంరెడ్డి వెంకట్‌రెడ్డి గారి మరణం ఈ రాష్ట్రానికే తీరని లోటు. వారి కుటుంబానికి నా తీవ్ర సంతాపాన్ని తెలియజేస్తు, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాను. ధన్యవాదములు.

**11.00 ఉ.** మిస్టర్ స్పీకర్ : ఖమ్మం జిల్లా పాలేరు శాసన సభ్యులు, ప్రజా పద్దుల కమిటీ అధ్యక్షులు శ్రీ రాంరెడ్డి వెంకట్ రెడ్డి గారి ఆకస్మిక మృతి పట్ల ఈ సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నది.

శ్రీ వెంకట్ రెడ్డి గారు ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం పాతలింగాల గ్రామంలో 1944 మే 22వ తేదీన నారాయణ రెడ్డి కమలమ్మ దంపతులకు జన్మించారు. వీరికి భార్య, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

శ్రీ వెంకట్‌రెడ్డి గారు ఉస్మానియా విశ్వవిద్యాలయము నుండి గ్రాడ్యుయేషన్ పట్టా పొందారు. వీరు 1962 నుండి 1977 వరకు 15 సంవత్సరముల పాటు పాతలింగాల గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. అనంతరం వీరు కొంత కాలం కో-ఆపరేటివ్ సొసైటీ ఛైర్మన్‌గా పని చేశారు.

శ్రీ వెంకట్‌రెడ్డి గారు 1996 సంవత్సరంలో తొలిసారి శాసన సభ సభ్యునిగా సుజాతనగర్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో ప్రాతినిధ్యం వహించారు. వీరు 1999, 2004 సంవత్సరాలలో సుజాతనగర్ నియోజక వర్గము నుండి, 2009, 2014

సంవత్సరాలలో పాలేరు నియోజక వర్గం నుండి శాసన సభకు ప్రాతినిధ్యం వహించారు.

శ్రీ వెంకట్ రెడ్డి గారు 2009 నుండి 2014 వరకు డా. వై. ఎస్. రాజశేఖర రెడ్డి, శ్రీ కె. రోశయ్య, శ్రీ ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి మంత్రి వర్గములలో కార్మిక, ఉపాధి కల్పన, సహకారము, ఉద్యాన వనములు, పట్టు పరిశ్రమ శాఖల మంత్రిగా పని చేశారు.

రాజకీయాలలో సౌమ్యుడు, మృదు స్వభావి, వివాద రహితుడిగా పేరు గాంచిన శ్రీ వెంకట్ రెడ్డి గారు అవినీతి అక్రమాలకు తావివ్వకుండా ఏ పదవిని చేపట్టినా, సమర్థవంతంగా బాధ్యతతో నిర్వర్తించి అందరి మన్ననలు పొందారు.

తెలంగాణ శాసనసభ ప్రజాపద్దుల కమిటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న శ్రీ వెంకట్ రెడ్డి గారు 2016 మార్చి 4వ తీదీన మరణించారు. గౌరవ ముఖ్యమంత్రి గారు మరియు ఇతర సభ్యుల మనోభావాలతో ఏకీభవిస్తూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తూ 2 నిమిషాలు మౌనం పాటిద్దాం.

(అనంతరం సభ రెండు నిమిషాల పాటు మౌనం పాటించింది.)

The House is adjourned to meet tomorrow at 10.00 am

(The House then adjourned at 11.04 am., to meet tomorrow again i.e., on Saturday, the 12th day of March, 2016 at 10.00 am)

**“Published under Rule 310 of the Rules of Procedure and Conduct of Business in the Telangana Legislative Assembly and Printed at Assembly Press, Public Gardens, Hyderabad.”**